# కొత్త కోణం

-ఎం.వెంకటేశ్వరరావు

"భాస్కరొచ్చాడండీ..."గుమ్మంలో ముగ్గేస్తున్న గాయత్రి పిలుపు విని పేపర్ చదువుతున్న చంద్రశేఖరం బయటికొచ్చి ఆశ్చర్యంగా,

"అరె! రావోయ్ భాస్కర్ రా! చాలారోజులైంది" అనేసరికి,

"నమస్కారం సార్! బావున్నారా?" అన్నాడు వినయంగా.

"రా! లోపల కూచుందాం"అని హాల్లోకి దారితీశాడు చంద్రశేఖరం.

ఇద్దరూ కుర్చీల్లో కూచునేంతలో కాఫీ గ్లాసులతో హాల్లోకి వచ్చిన చంద్రశేఖరం భార్య గాయత్రి.

"భాస్కర్ బాగున్నావా? అమెరికా వెళ్లావట గదా! చాలా సంతోషం" అని కాఫీ గ్లాసందించింది.

"అవునమ్మా! ఆఫీసువాళ్ళే ఆర్నెల్లు ప్రాజెక్టు పనికోసం పంపారు" అన్నాడు కాఫీ సిప్ చేస్తూ.

"ఆఁ...ఏవిటోయ్ సంగతులు? ఇన్ఫోసిస్‌లోనే జాబ్ చేస్తున్నావా?" అడిగాడు చంద్రశేఖరం.

"అవున్సార్. అద్సరే.. మీరు ఇల్లు అమ్మేశారా? నాకు తెలియక మీ ఇంటికెళితే వేరెవరో ఉన్నారు. వాళ్లిచ్చిన అడ్రస్ ప్రకారం వెతుక్కుంటూ వచ్చాను" అన్నాడు.

కళ్లజోడు తీసి పక్కనబెడుతూ "అవును. మా భార్గవి పెళ్లికి, మా రాజా చదువుకి డబ్బు అవసరమై వెసులుబాటు కాక అమ్మేశాను"

"సెంటర్లో ఇల్లుగదండీ"

"ఏం చేస్తాం? అవసరాలు అమ్ముకునేలా చేశాయి" అన్నాడదోలా.

కాఫీ గ్లాసు కిందబెట్టి చేతిలో ఉన్న ఇన్విటేషన్ కార్డు చంద్రశేఖరం, గాయత్రిల చేతికిస్తూ-

"మీరిద్దరూ తప్పకుండా రావాలి" అన్నాడు.

సింపుల్‌గా, అందంగా ఉన్న ఆ కార్డుని చంద్రశేఖరం ఆశ్చర్యంగా చూస్తూంటే-

"ఇల్లు కట్టావా?" అంది అబ్బురంగా.

"అవునండీ! కూకట్‌పల్లి దగ్గర శాంతినగర్‌లో"

"శాంతినగర్‌లోనా?! ఇప్పుడక్కడ స్థలం కొనడం, ఇల్లు కట్టడం సామాన్యుల వల్ల అయ్యే పనిగాదే. హైటెక్‌సిటీకి షార్ట్‌కట్ వేశాక స్థలాలరేట్లు ఆకాశంలో తాయిలంలా ఉన్నాయట గదా!" అన్నాడు చంద్రశేఖరం.

"తెల్సినవాళ్లద్వారా దొరికిందండీ. మంచి సెంటర్. అదృష్టమనే అనుకోవాలి. మంచి ఛాన్స్ వదలకూడదని తీసుకున్నాను" అని చెప్పాడు భాస్కర్.

"ప్లాటా? ఫ్లాటా?" అంది గాయత్రి.

"రెండూకాదు. ఓ పాత ఇల్లు. మొత్తం పడగొట్టకుండా మార్పులు చేయించా"

"మొత్తం ఎంతైంది?" గాయత్రి సూటిప్రశ్నకి భాస్కర్ చెప్పిన బదులు విని నోరెళ్ళబెట్టింది.

"లోనెంత తీసుకున్నావు?"చనువు కొద్దీ అడిగినా భార్య ప్రశ్న చంద్రశేఖరానికి అతి అన్పించింది. చిన్నగా నవ్వి చెప్పాడు భాస్కర్.

"మరి మిగిలిన డబ్బుకేం చేశావ్? అప్పు తీసుకున్నావా?"

"ఏం చేస్తే నీకెందుకే. యక్షప్రశ్నలెయ్యకు" ఆగలేక భార్య నోటికి తాళం వేసే ప్రయత్నం చేశాడు చంద్రశేఖరం.

"వచ్చే జీతం టాక్సుకీ, లోన్లకీ, అప్పులకే సరిపోయేట్టుందే" అంది గాయత్రి.

"నువ్వు లోపలికి వెళ్ళు" కాస్త గట్టిగానే అన్నాడు చంద్రశేఖరం.

"ఏముంది సార్ ఇందులో..నేనూ మీ కొడుకులాంటివాణ్ణి మీ దగ్గర దాచేందుకేముంది?" అని గాయత్రి వైపు తిరిగి,

"కొన్నాళ్ళు కష్టంగానే ఉంటుందండి. అడ్జస్ట్ అవ్వాలి. ఒకటి కావాలనుకుంటే మరొకదాన్ని గురించి ఆలోచించకూడదు" అన్నాడు భాస్కర్.

"అదికాదు. రేపు నీకు పెళ్ళి, ఖర్చులు...అసలే కట్నకానుకలు వద్దంటుంటివి" అంది గాయత్రి.

"మా అమ్మ కూడా ఇలానే అంటోంది. కానీ ఒక్కరోజు పెళ్లికోసం ఆడంబరాలకు, ఆర్భాటాలకు పోయి లక్షల్లో ఖర్చుచేసి అప్పుల పాలయ్యేకంటే గుళ్ళో పెళ్లి చేసేసుకుని హోటల్లో రిసెప్షనిస్తే సింపుల్‌గా అయిపోతుంది. కానీ మనకిష్టం వచ్చినప్పుడు ఇష్టపడ్డచోట మన దగ్గర డబ్బులున్నప్పుడు కొనాలంటే శివార్లలో కూడా సెంటీమీటర్ స్థలం కొనలేమండీ" అన్నాడు భాస్కర్.

అంతే! అతని మాటలకి గాయత్రికి ఏం చెప్పాలో, ఆపై ఏం అడగాలో అర్థంకాలేదు.

"నీ ఆలోచన చాలా బాగుంది. బుద్ధిమంతుడివి. కష్టపడి చదువుకున్నావు. ఇదంతా మీ అమ్మ కష్టం, నీ అదృష్టం" అన్నాడు చంద్రశేఖరం.

"అంతా మీ ఆశీర్వాదం సార్!" అని లేచి నిలబడి మా ఇద్దరి కాళ్లకీ నమస్కరించి, "మీరిద్దరూ తప్పకుండా రావాలి" అని మళ్లీ చెప్పి బయల్దేరాడు భాస్కర్.

అతను కనుమరుగయ్యాడో లేదో గాయత్రి దీర్ఘంగా నిట్టూర్చి "హుఁ! నిండా ముప్ఫయ్ ఏళ్లు లేవు. అప్పుడే ఇల్లు, అదీ పోష్ ఏరియాలో. నిన్న మొన్నటి వరకూ అర్భకుడిలా పుస్తకాలు పట్టుకుని మన రాజాతో కాలేజీకెళ్ళే భాస్కరేనా అన్పిస్తోంది" అనుకుంటూ లోపలికెళ్లింది.

* * *

చంద్రశేఖరం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు. ఇంగ్లీషు చెప్పేవాడు. విద్యార్థుల మనసుకి హత్తుకుపోయేట్టు చెప్తుంటే విద్యార్థులతో పాటూ తోటి టీచర్లు అబ్బురపడేవాళ్ళు. అంతెందుకు స్కూల్లో పనిచేసే వాచ్‌మెన్ తనకేమీ అర్థం గాకపోయినా చంద్రశేఖరం పాఠం చెప్తున్నంతసేపూ గోడ బయట నిలబడిపోయేవాడు.

ఇతర టీచర్లు ఆయనతో ఇంగ్లీషులో మాట్లాడడానికి భయపడేవాళ్ళు. అలాంటి చంద్రశేఖరాన్ని తన ప్రతిభతో ఆశ్చర్యపరిచిన వాడు భాస్కర్. అతనడిగే ప్రశ్నలకి చంద్రశేఖరం బుక్స్ రిఫర్ చేసి బదులు చెప్పాల్సి వచ్చేది. ఇంతకీ భాస్కరేం పెద్దింటి పిల్లాడు కాదు. వాళ్ళమ్మ టిఫిన్ సెంటర్ నడుపుతూ ఎన్నో కష్టాలకెదురీది కొడుకుని చదివించింది. ఎన్నో ఆటుపోట్ల మధ్య చదువునే నమ్ముకున్న భాస్కర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. ఆరంభమే ముప్ఫయ్ వేల జీతంతో మూడేళ్లక్రితమే ఉద్యోగంలో చేరాడు. ఆ మధ్య ఓ ఆర్నెల్లు అమెరికా వెళ్లొచ్చాడు.

మౌనంగా పేపర్ చూస్తున్న చంద్రశేఖరానికి అక్షరాల వెంట కళ్ళు కదులుతున్నా ఆశ్చర్యం భాస్కర్ చుట్టూ పరిభ్రమిస్తోంది.

"ఎంతసేపు చదువుతారా పేపర్?" అంది లోపలినించి వచ్చిన గాయత్రి. పేపర్ పక్కన

పడేసి "భాస్కర్ చెప్పిన ఓ విషయాన్ని గమనించావా?'' అన్నాడు.

"ఏమిటి?'' అంది కూచుంటూ.

"పెళ్లి గుళ్ళో చేసుకున్నా ఫర్వాలేదు గానీ ఇల్లు ఏర్పరచుకోడం ముఖ్యం అన్నాడు చూశావా?''

"నిజమేనండీ. ఆర్భాటాలకి పోయి ఒక్కరోజు తంతుకోసం ఉన్నదంతా వదిలించుకుని అదీ చాలక అప్పుల పాలవడం వలన ఎవరికి ప్రయోజనం చెప్పండి. తినిపోయేవాళ్ళేగానీ మన స్ఫూర్తిగా దీవించే వాళ్ళెంత మంది ఉంటారు? భాస్కర్ చిన్నవయసులో పెద్ద ఆలోచన చేశాడు. అసలు ఈకాలపు పిల్లల ఆలోచనలే వ్యత్యాసంగా ఉన్నాయి'' అంది లేచెళుతూ.

★ ★ ★

కూకట్‌పల్లిలో కొంచెం లోపలికెళ్లాక పెద్దగా శ్రమ పడకుండానే అడ్రస్ ప్రకారం భాస్కర్ ఇంటికి చేరుకున్నారు చంద్రశేఖరం, గాయత్రి. అప్పటికే చాలామంది వచ్చారు. వాళ్లలో ఎక్కువమంది భాస్కర్ స్నేహితులే. బంధువుల్ని వేళ్ల మీదే లెక్కించొచ్చు.

"రండిసార్! రండమ్మా! అడ్రస్ ఈజీగా కనుక్కున్నారా? లోపలకిరండి'' అని ఇద్దర్నీ సాదరంగా ఆహ్వానించి అక్కడే ఉన్న తన ఫ్రెండ్స్‌కి పరిచయం చేశాడు. ఇద్దరికీ ఇల్లంతా తిప్పి చూపించాడు. పాత ఇల్లే. చిన్న చిన్న మార్పులు చేసి ఆ మార్పులు తెలియకుండా కొత్త ఇల్లన్పించేలా ఉంది.

"ఇల్లెలా ఉంది సార్!'' అడిగాడు భాస్కర్.

"చాలా బావుంది. పాత ఇల్లంటే నమ్మేట్టు లేదు. అదేమిటి రోడ్డు వైపు కార్నర్‌లో షాపులా కట్టావు?''

"అవున్సార్ షాపే''

"అద్దెకిస్తావా?''


"లేదు సార్. మా అమ్మనడిపే టిఫిన్ సెంటర్ కోసం'' చంద్రశేఖరం, గాయత్రి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

అంతలో ఎవరో రావడంతో భాస్కర్ వాళ్లని రిసీవ్ చేసుకోవడానికి వెళ్లాడు. చంద్రశేఖరం మనస్సు చివుక్కుమంది.

భాస్కర్ని ఎంత ఉన్నతంగా ఊహించుకున్నాడు తను.

చంద్రశేఖరం కళ్ళు భాస్కర్ తల్లికోసం వెతికాయి. ఆమె అక్కడ కన్పించలేదు కానీ ఇరవై ఏళ్ళు నిండిన గతం మాత్రం కళ్లముందు కదలసాగింది.

★ ★ ★



ప్రొద్దుటూరు ప్రక్కనున్న పల్లెటూరు నుంచి ఎనిమిదేళ్ళ కొడుకుని వెంట బెట్టుకుని బ్రతుకు తెరువుకోసం హైదరాబాద్‌కు వచ్చారు లక్ష్మన్న, అంజనమ్మ. చంద్రశేఖరం పనిచేసే స్కూల్ ముందు చిన్న టీ స్టాల్ తెరిచారు.

తక్కువకాలంలోనే నిలదొక్కుకుని దానిని టిఫిన్ సెంటర్‌గా మార్చారు. కొడుకు భాస్కర్ని ముందున్న స్కూల్లో ఆరో తరగతిలో చేర్చారు. అప్పట్నుంచీ చంద్రశేఖరంతో ఆ దంపతులకి పరిచయం ఏర్పడింది. అంజనమ్మ ఇడ్లీలు, దోసెలు చేస్తుంటే, లక్ష్మన్న టీ,కాఫీ తయారుచేసేవాడు.

రుచి, శుచి ఉండడం వల్ల త్వరలోనే మంచి గుర్తింపు వచ్చింది. మూడేళ్ళు సజావుగా సాగేసరికి దైవం చిన్నచూపు చూసినట్టు బజారుకెళ్లి సరుకులు తీసుకుని సైకిల్ మీద వస్తున్న లక్ష్మన్నని లారీ గుద్దెయ్యడంతో అక్కడికక్కడే మరణించాడు. ఇన్నాళ్ళూ భర్త చాటు భార్యగా బ్రతికిన అంజనమ్మ పిల్లలతో ఒంటరిగా బజార్లో నిలబడాల్సి వచ్చింది. ఊరుగాని ఊళ్ళో మగతోడు లేకుండా మనుగడ కష్టమనుకుని ఊరెళ్లిపోవాలని నిర్ణయించుకుని భాస్కర్‌ని స్కూలు మాన్పించి తీసుకెళ్తున్నట్టు చంద్రశేఖరం దగ్గరకెళ్లి చెప్పడంతో-

"చూడమ్మా! భాస్కర్ చురుకైనవాడు, తెలివైనవాడు. ఇప్పుడిలా అర్ధంతరంగా స్కూలు మాన్పిస్తే భవిష్యత్తు పాడవుతుంది'' అని చెప్పాడు.

"నిజమే సారూ! తిండికే కష్టమవుతుండాది. ఇక సదువులంటే...'' అంది కళ్ళొత్తుకుంటూ.

"లక్ష్మన్న హోటలంటే ఈ చుట్టు ప్రక్కల అందరికీ తెలుసు. మళ్లీ నువ్వెందుకు మొదలు పెట్టగూడదు? కష్టాలొచ్చినప్పుడే ధైర్యంగా పోరాడాలి''

"డబ్బులెవురిస్తారు సారూ! అయినోళ్ళవళ్ళూ పట్టించుకోవడం లేదు''

"దిగులుపడకు నేను బ్యాంకులోను ఇప్పిస్తాను. మళ్లీ నువ్వు టీస్టాల్ ప్రారంభించి భాస్కర్‌ని చదివించు'' అని చెప్పాడు.

ఆ మాటలు అంజనమ్మలో సన్నగిల్లుతున్న ధైర్యానికి జీవం పోశాయి. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఆమె టిఫిన్ సెంటర్ నడుపుతూనే ఉంది.

* * *

కాస్సేపటి తర్వాత అటువైపు వచ్చిన భాస్కర్ "సార్! భోజనానికి రండి'' అనేసరికి ఆలోచనల్నుంచి బయటికొచ్చిన చంద్రశేఖరం చుట్టూ చూశాడు. అంతా భోజనాలకెళ్తున్నారు.

"భాస్కర్! నిన్నో విషయం అడుగుతాను అపార్థం చేసుకోవు కదా!''

"భలేవారే! అడగండి''

"మీ అమ్మకోసం షాపు కట్టానన్నావు. నువ్వు మంచి సంపాదన పరుడివయ్యాక కూడా మీ అమ్మ ఇంకా టిఫిన్‌సెంటర్ నడపాలా? ఈ వయసులో ఆమెని కష్టపెట్టడం బావుంటుందా? ఆలోచించు'' అన్నాడు చంద్రశేఖరం నింపాదిగా.

"నేను ఉద్యోగంలో చేరిన వెంటనే అమ్మతో ఇదే మాట చెప్పాను. కానీ ఆవిడ ఏమందో తెలుసాండీ. ఇవ్వాళ నువ్వీ స్థితికి రావడానికి ఇన్నేళ్ళూ మనల్ని ఆదుకున్నదీ ఈ టిఫిన్ సెంటరే. ఈరోజు నీకు ఉద్యోగం వచ్చిందని, మన అంతస్తు పెరిగిందని అస్తివారాన్ని మరచిపోతామా? నీ అందం చూసుకుని నేనయితే మానెయ్యగలను గానీ దీన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న టీ మాస్టర్ని, పనిపిల్లల్ని నాకారణంగా నిరుద్యోగుల్ని చెయ్యమంటావా? టిఫిన్ సెంటర్ నడపడం ఒక్కటే నాకు తెలిసిన పని. ఇదే నేను ఏ టీచరునో, ఆఫీసరునో, డాక్టర్‌నో అయ్యుంటే చేస్తున్న పనిమానెయ్యమని ఉండేవాడివా? ఈ వృత్తి నాకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థికబలాన్ని, ఆత్మగౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఇన్నేళ్ళూ నిన్ను చదివించి వృద్ధిలోకి తేగలనన్న నా నమ్మకానికి వెన్నెముక ఈ టిఫిన్ సెంటరే. ఇవ్వాళ ఇందులో వచ్చే డబ్బుతో జీవించేస్థితి నుండి మనల్ని ఉన్నతస్థితికి చేర్చి ఈ వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించి, అభాగ్యుల్ని ఆదుకుని నీడనిచ్చే మరెన్నో ఫలవృక్షాల నివ్వాలి. ఇందులో వచ్చే లాభాలు ఇక్కడ పనిచేసే నలుగురికీ చెందాలి అంది సార్.

అమ్మ కష్టపడకూడదని ఆలోచించిన నాకు ఆమె ఆలోచనలో కొత్త కోణం కన్పించింది. తనంతట తాను విరమించుకునే వరకూ ఆమె పనిచెయ్యడంలో నాకెటువంటి ఆక్షేపణా లేదు. అందుకే ఆపదల్లో ఉన్న నలుగురికి ఆధరువు కల్పించాను. గ్యాస్‌స్టౌ, పిండి రుబ్బే మెషీన్లు, ఫర్నిచరూ కొన్నాను. అమ్మ ఆధ్వర్యంలో ఈ టిఫిన్ సెంటర్ ఆమె ఆశయాల నీడలో నిరాటంకంగా కొనసాగించాలని నిర్ణయించుకున్నాను'' అన్నాడు భాస్కర్.

"రియల్లీ ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యు. అందరిలాగే నేనూ ఆలోచించాను. నీలాంటి యువకులకి మీ అమ్మ అందించిన ఆశయాల నీడ ఎంతో అవసరం. హర్షించదగ్గ విషయం, ఆహ్వానించదగ్గ మార్పు. వంట్లో ఓపిక ఉండి చేస్తున్న వృత్తిని వదిలి, కొడుకుల మీద ఆధారపడి స్వేచ్ఛను కోల్పోయి ఆత్మాభిమానం చంపుకుని బ్రతుకుతున్న ఎందరికో కనువిప్పిది. కీపిటప్'' అని ఆప్యాయంగా భాస్కర్ భుజం తట్టి భోజనానికి లేచాడు చంద్రశేఖరం.

★



## ధీమా

ఖుషీ, సింహాద్రి, మిస్సమ్మ, ఒక్కడు...వంటి సూపర్‌హిట్ చిత్రాల్లో నటించి అందర్నీ మెప్పించిన భూమిక అటు బాలీవుడ్‌లో కూడా నటించింది. రాజాతో కలసి నటించిన మాయాబజార్ యావరేజ్ టాక్ రావడంతో ఊపిరి పీల్చుకుంది. ముమ్మందు మరిన్ని తెలుగు చిత్రాల్లో నటించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇంతకుముందులాగే తన నటనలో, అందంలో ఎలాంటి మార్పులేదని, మాయాబజార్‌లో తన నటన చూసినవారికి అర్థమవుతుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది.

